క్లుప్తంగా

బూడిదైన గోధుమ పంట



దగ్ధమైన గోధుమ పంట

భైంసారూరల్: మండలంలోని సిద్దూర్ గ్రామంలో మారుతిపటేల్ అనే రైతుకు చెందిన గోధుమ పంట కుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో కాలి బూడిదైంది. శివారులోని తన ఎకరంలో గోధుమ సాగు చేయగా ఇటీవల పంటను కోసి కుప్ప పెట్టాడు. శనివారం తెల్లవారుజా మున గుర్తు తెలియని వ్యక్తులు గోధుమ పంటను కాల్చి వేశారని అనుమానం వ్యక్తంచేశాడు. ఉదయం చేను వద్ద చూసేసరికి పంట కాలిబూడిదైందని.. సుమారు రూ.50 వేల న ష్టం జరిగిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఏఈఓగా ఖానాపూర్ యువతి



నియామకపత్రం అందుకుంటున్న లక్ష్మీప్రసన్న

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన ఉపాధ్యాయుడు జీఎల్‌వీ ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్ సరళాదేవి దంపతుల కూ తురు జి.లక్ష్మీప్రసన్న పంచాయతీరాజ్ శాఖలో ఏఈఓ ఉద్యోగానికి ఎంపికైంది. ఈనెల 20న హైదరాబాద్ రవీంద్రభారతిలో సీ ఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆర్డర్ కాపీని అందుకుంది. అధికారులు ఆమెకు ముధోల్ సబ్‌డివిజన్ పీఆర్ ఏఈఓగా విధులు కేటాయించారు.

పరీక్ష కేంద్రాలు పరిశీలన



వద్యాల్‌లో కేంద్రం వద్ద ఎంపీడీవో, సిబ్బంది

లక్ష్మణచాంద: మండలంలోని వద్యాల్, లక్ష్మణచాంద పాఠశాలల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను శనివారం ఎంపీడీవో రాధ సందర్శించారు. వద్యాల్‌లో 168మంది, లక్ష్మణచాందలో 174 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా అందరూ హాజరయ్యారని పేర్కొన్నారు. ఇందులో సీఎస్‌లు మోహన్, భూషణ్, డీవోలు హరిప్రసాద్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి

ఖానాపూర్: పట్టణంలోని డబుల్ బెడ్‌రూం కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించా లని కోరుతూ శనివారం పలు బ్లాక్‌ల ప్రజలు మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. సరిపడా భగీరథ నీరు సరిపడా రావడం లేదని.. దీంతో నీటి కోసం ఇతర చోట్లకు వెళ్తూ ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. కాలనీలోని బీ6, బీ7, సీ5, సీ6 బ్లాక్‌లలో సమస్య మరింత తీవ్రంగా ఉందని వివరించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం వద్ద సివిల్ జడ్జి రాధిక

నిర్మల్‌టౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా సంస్థ సెక్రెటరీ జి.రాధిక ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దూర ప్రాంతం నుంచి వచ్చే కక్షిదారులకు ఈ చలివేంద్రంతో దాహం తీరుతుందని పేర్కొన్నారు. న్యాయవాదులు కె. అంజు కుమార్‌రెడ్డి, ప్యానల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు తదితరులు ఉన్నారు.

పాఠశాల సందర్శించిన ఎస్పీ

బాసర: వేద పాఠశాలలో విద్యార్థిపై దాడి ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్, ముధోల్ సీఐ మల్లేశ్, బాసర ఎస్సై గణేశ్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల సి బ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్పీ తెలిపారు.

వాహనాలు తనిఖీ

ముధోల్: మండలకేంద్రంలో శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై సంజీవ్ మాట్లాడుతూ వాహనాదారులు తమ వెంట అన్ని ధ్రువీకరణ పత్రాలను ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

ఉపాధి గ్రామసభ

దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్‌లో శనివారం ఉపాధి గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి రవీందర్ మాట్లాడుతూ ఉపాధిహామీ నిధులు కోటి రూపాయలతో సీసీరోడ్లు నిర్మించేందుకు తీర్మాణం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

కుభీర్‌లో నీటికి కటకట

- ఎండిపోతున్న బోరుబావులు
- అసంపూర్తిగా భగీరథ పథకం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



చాకలిగల్లీలో మినీ ట్యాంక్ వద్ద నీటి కోసం వేచిచూస్తున్న మహిళలు

కుభీర్: మేజర్ గ్రామపంచాయతీ అయిన కుభీర్‌లో నీటికష్టాలు తీవ్రమయ్యాయి. ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటి.. బోర్లు ఎండిపోయాయి. తాగునీటితోపాటు కనీస అవసరాలు తీర్చుకునేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కుభీర్‌లో సుమారు 8వేల జనాభా ఉంది. గ్రామపంచాయతీ ఏర్పాటు చేసిన బోర్ల నుంచి పైపులైన్ ద్వారా మినీట్యాంకులను నీటితో నింపుతారు. మినీట్యాంకుల తోపాటు అక్కడక్కడా ఏర్పాటు చేసిన కుళాయిల వద్దకు మహిళలు వచ్చి ఇళ్లలోకి నీటిని తీసుకెళ్తారు. మరోవైపు ఇంటింటికీ శుద్ధజలం అందించే మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు గ్రామంలో చాలా చోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. ప్రధాన పైపులైన్ నుంచి నాలుగు పెద్దట్యాంకుల్లోకి వెళ్లి.. అక్కడ నుంచి ఇంటింటికీ సరఫరా చేస్తారు. ఇంటింటికీ నీటిని అందించే భగీరథ పథకం అసంపూర్తిగా ఉంది. కొన్నిచోట్ల పైపులైన్‌లో చెత్త చేరి నీళ్లు సరిగా సరఫరా కావడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి నీటి కష్టాలను తీర్చాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

అల్లాడుతున్న కాలనీవాసులు..

కుభీర్ మండలకేంద్రంలోని ఎస్సీకాలనీ, సాకలిగల్లీ, బట్టిగల్లీ, కొత్తకాలనీ, మెదరివాడలో జనం నీటి కోసం అల్లాడుతున్నారు. గతంలో మిషన్ భగీరథ పైపులైన్ పనులను అస్తవ్యస్తంగా చేయడంతో నీరు మినీ ట్యాంకులోకి వెళ్లడం లేదు. ఎస్సీ కాలనీ, సాకలిగల్లీ వాసులు నిత్యం రాత్రి మహాదేవ్ మందిర్‌కు వెళ్లి అక్కడున్న బోరు వద్ద వరుసలో నిలబడి నీటిని పట్టుకుంటున్నారు. ఈ కాలనీలో రాత్రి 12 గంటల తర్వాతే నీళ్లు వస్తుండటంతో మెలకువగా ఉండి పట్టుకుంటున్నారు.

ఇష్టానుసారం భగీరథ కనెక్షన్లు..

గ్రామంలో ఇష్టానుసారంగా రోడ్డును తవ్వి భగీరథ కనెక్షన్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. పంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ఇరువైపులా సీసీ రోడ్డును ధ్వంసం చేసి మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి ఇళ్లలోకి కనెక్షన్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇష్టానుసారం తవ్విన గుంతలతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. మరోవైపు సీసీరోడ్లు దెబ్బతింటున్నాయి.



మున్నూరుకాపు సంఘ కార్యాలయం వద్ద..



భగీరథ కనెక్షన్ కోసం తవ్వి వదిలేసిన గుంత

మెలకువతో ఉంటున్నాం



కాలనీవారు నీళ్ల కోసం రాత్రి 12 గంటల వరకు మెలకువగా ఉంటున్నారు. ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న బోరు నుంచి కుళాయిలకు నీరు వస్తుంది. ఈ నీరు రాకుంటే పర్లాంగు దూరంలో ఉన్న మహాదేవ్ మందిరం నుంచి తెచ్చుకోవాలి.

– బి.నారాయణ, చాకలిగల్లీ

సమస్యను పరిష్కరిస్తాం

గ్రామంలో నీటి సమస్య వాస్తవమే. ఇప్పటివరకు 4 బోర్లు ఎండిపోయాయి. నీటి ఎద్దడి నెలకొనడంతో గ్రామస్తులకు భగీరథ కనెక్షన్ ఏర్పాటుకు అనుమతిచ్చాం. గ్రామంలో నీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తాం

– ప్రశాంత్, భగీరథ ఏఈ, కుభీర్

బోర్లలో ఎండిపోయిన జలం..

గ్రామంలోని చాలా బోర్లలో జలం అడుగంటిపోయింది. గ్రామపంచాయతీకి చెందిన చాకలిగల్లీ బోరు, మున్నూరుకాపు సంఘం వద్ద, కొత్తకాలనీల్లో రెండు బోర్లు ఎండిపోయాయి. దీంతో ప్రస్తుతం సదరు కాలనీల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. ఇప్పటికైనా నీటి సమస్యను తీర్చాలని ఆయా కాలనీల ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.

సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి

- అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిశోర్‌కుమార్ తెలిపారు. బాలశక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ సందర్శనకు వచ్చిన నిర్మల్ కేజీబీవీ విద్యార్థినులతో తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయ పనితీరు, రెవెన్యూ అంశాలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులంతా చరిత్ర, రాజ్యాంగం, జనరల్ నాలెడ్జ్‌పై పట్టు సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగాలను సులభంగా సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు జిల్లా కార్యాలయాలను సందర్శించారు. అధికారులు సలోమి కరుణ, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్

నిధులు మంజూరు చేయాలని వినతి

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లిలో రామాలయం వద్ద రెండు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆ ఊరి ప్రజలు శనివారం నిర్మల్‌లో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించారు. నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, నాయకులు ఆలయ కమిటీ సభ్యులు గంగాధర్, శ్రీనివాస్, సుదర్శన్, రాజేందర్, సాగర్‌రెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీహరిరావుకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

బ్యాగులు పంపిణీ

మామడ: మండలంలోని దిమ్మదుర్తి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం 56 మంది విద్యార్థులకు ఎన్ఆర్ ట్రస్ట్ సమకూర్చి న బ్యాగులను డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీ హరిరావు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చే శారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, పడాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెరిగిన కరువుభత్యం అమలు చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు చే యాలని ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆర్గనైజేషన్(టీయూసీఐ) రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న డి మాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో శని వారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 7 ల క్షల మంది బీడీ కార్మికులకు కరువు భత్యం 104 పాయింట్లు పెరిగిందని, పాయింట్‌కు 10.40 పైసల చొప్పున వేయి బీడీలకు మొత్తం కూలి రేటు రూ. 261.97పైసలు అవుతుందన్నారు. యాజమాన్యాలు అలసత్వం ప్రదర్శిస్తే కరువు భ త్యం అమలు కోసం ఆందోళనకు సి ద్ధం కావాలని బీడీ కార్మికులకు పిలుపునిచ్చారు. యూనియన్ అధ్యక్షుడు ఎం.బక్కన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రామలక్ష్మణ్, జిల్లా సహాయకార్యదర్శి ఎస్.గంగన్న, చిల్లకోశాధికారి ఎండీ.గఫూర్, పీ వో డబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రాజన్న

రాయితీపై ప్రచారం చేయాలి

ఖానాపూర్: ఈనెల 31లోపు ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ చేసుకున్న వారికి ప్రభుత్వం కల్పించే 25శాతం రాయితీపై విస్తృత ప్రచారం చేసి అవగాహన కల్పించాలని నిర్మల్ డీఎల్‌పీవో అజీజ్ అన్నారు. శనివారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌ను సందర్శించారు. అనంతరం మండలంలోని సత్తన్‌పల్లి పంచాయతీ కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో రత్నాకర్ రావు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్వీ నాయకుల అరెస్టు

దస్తురాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి త క్కువ నిధులు కేటాయించారని బీఆర్ఎస్వీ శనివారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ సోషల్ మీడియా ఖానాపూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బొమ్మెలన గోపి, మండలాధ్యక్షుడు రాజేందర్‌ను ఎస్సై అశోక్, సిబ్బంది అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కడెం: అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు కమ్మల స్వామి, కల్వకుంట్ల న రేశ్, పందిరి సుధాన్, నరేందర్ తదితరులున్నారు.

నిర్మల్‌టౌన్: పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులను హైదరాబాద్ వెళ్లకుండా పోలీసులు అరెస్టు చేశారు. విశాల్, హరీశ్, ఆకాశ్‌సింగ్, ప్రశాంత్, నితిన్, శ్రీకాంత్ తదితరులున్నారు.

ఖానాపూర్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగంతోపాటు నూతన ఉద్యోగాల కల్పనకు సరిపడా నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. బీఆర్ఎస్ నాయకులు వెళ్లకుండా పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రణీత్, మహిపాల్, వంశీ, శ్రీకాంత్, లాజర్, సాయి, నరేశ్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

భక్తి మార్గంలో నడవాలి

తానూరు: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని నాందేడ్ జిల్లాకు చెందిన మహాదేవ్ మహరాజ్ సూచించారు. మండలంలోని బోంద్రట్ గ్రామంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన కీర్తన కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదానం చేశారు. వార్‌కరి భక్తులు, సప్తాహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రూ.1.47కోట్ల నిధులు మంజూరు

ముధోల్: మండలంలోని ఆష్టా గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణాలు తదితర అభివృద్ధి పనుల కోసం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ.1.47కోట్లు మంజూరైనట్లు బీజేపీ నాయకులు పట్టేపురం సతీష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. త్వరలో వితోలి తండా నుంచి ఆష్ట గ్రామం వరకు రూ.2కోట్లతో బీటీ రోడ్డు పనులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

దస్తురాబాద్: ఆటోడ్రైవర్లు విధిగా రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని ఎస్సై అశోక్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్సైని ఆటో యూనియన్ నాయకులు సన్మానించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దని సూచించారు. ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు నరేశ్, తిరుపతి, పోషం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామ రామాలయం వద్ద శనివారం చలివేంద్రాన్ని గ్రామస్తులు ప్రారంభించారు. భక్తులకు ఇబ్బంది కల్గకుండా గ్రామానికే చెందిన సుదర్శన్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ గంగాధర్, గ్రామస్తులు మధు, గంగారెడ్డి, శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు ముందుకొచ్చిన నాయకుడు

తానూరు: మండలంలోని బెంబర ప్రాథమిక పాఠశాలలో తాగునీటి కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను పోషకులు వాట్సాప్ గ్రూప్‌లలో షేర్ చేశారు. ఇది తెలిసి పాఠశాలకు నీటిని సరఫరా చేస్తానని అదే గ్రామానికి చెందిన వడ్నపువార్ సాయినాథ్ అనే యువ నాయకుడు ముందుకొచ్చాడు. విద్యాసంవత్సరం ముగిసే వరకు నీటిని అందిస్తానని పేర్కొన్నాడు. కార్యదర్శి జయశ్రీ, సుపూరి మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖానాపూర్ బస్టాండ్ సందర్శించిన డీఎం

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను శనివారం రాత్రి నిర్మల్ డీఎం పండరి సందర్శించారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మొదటిసారి ఖానాపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికుల వివరాలు సౌకర్యాలు తెలుసుకున్నారు. స్థానిక అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వాజ్‌పేయి ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలి

సోన్: మాజీ ప్రధాని వాజ్‌పేయి అందించిన స్వపరిపాలన, ఆశయాలను భావితరాలకు అందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప రిణీత పేర్కొన్నారు. శనివారం అటల్‌జీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సోన్‌లో పర్యటించారు. వా జ్‌పేయితో అనుబంధం ఉన్న మండలకేంద్రానికి చెందిన ముత్యపల్లి నరేశ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, మేకల అశోక్, మామిడాల సంతోష్, గడ్డం నర్సయ్య, దాసరి శ్రీనివాస్, జక్క రాజేశ్వర్, నవీన్, రాము, మక్కన్న, రాజు, రాకేశ్, రమేశ్, నవీన్, పత్తి రాజు, గంగాధర్ తదితరులు ఉన్నారు.



పరిణీతను సన్మానిస్తున్న నాయకులు

జలంతోనే జీవనం

- డీఆర్డీవో విజయలక్ష్మి

కడెం: జలం లేనిదే.. జీవం లేదని వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాన్ని పెంపొందించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. శనివారం ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలోని రైతు వేదికలో భూగర్భ జల సంరక్షణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా భూగర్భజల శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతు సమస్త ప్రాణకోటికి నీరు ఎంతో అవసరమన్నారు. ఎన్నో దేశాలు నీళ్ల లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. నీటిని పొదుపు చేసి భావి తరాలకు జలాలను అందించాలని కోరారు. అంతకు ముందు మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో డీఆర్డీవో విజయలక్ష్మి బోర్‌వెల్ రీస్ట్రక్చర్ ప్రారంభించారు. ఇందులో ఎంపీడీవో అరుణ, ఏవో దినేశ్, ఉద్యాన క్లస్టర్ అధికారి స్పందన, ఈజీఎస్ హెచ్‌ఆర్ సుధాకర్, మిషన్‌భగీరథ ఏఈ అభిలాష్, ఎంపీవో కవిరాజు, ఏపీవో జయదేవ్, ఈజీఎస్ సిబ్బంది కవిత, కాంతారావు, గణేశ్, రాజు పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాలలో బోర్‌వెల్ రీస్ట్రక్చర్‌ను ప్రారంభిస్తున్న డీఆర్డీవో

ఇఫ్తార్‌విందు ఇచ్చిన అంజన్న స్వాములు

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర మజీద్ ప్రాంగణంలో ముస్లింలకు అదే గ్రామానికి చెందిన అంజన్న (హనుమాన్) దీక్షాపరులు ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. కులమతాలకు అతీతంగా గ్రామస్తులంతా ఒక్కటేనని ఐక్యత భావం చాటారు. గురుస్వామి రమేశ్‌గౌడ్, సాయాగౌడ్, సంజీవ్‌రెడ్డి, సా యన్న, బాజన్న, విజయ్‌రెడ్డి, భూమేశ్, లింగన్న, భూ మన్న, సాయిలు, గంగాధర్, భోజన్న పాల్గొన్నారు.



ఇఫ్తార్‌విందులో ముస్లింలు, దీక్షాపరులు

విద్యార్థులు నిబంధనలు పాటించాలి

నిర్మల్‌టౌన్: అతివేగం, మద్యం తాగి నడపడమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని.. ప్రతి ఒక్కరూ విధిగా భద్రత నియమాలను పాటించా లని నిర్మల్ ఏఎస్పీ ఉపేంద్రరెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మత్తులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఉపాధ్యాయులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ ఉపేంద్రరెడ్డి

ఈదురుగాలులకు కూలిన ఇల్లు

- నిరాశ్రయులైన వృద్ధ దంపతులు

పెంబి: మండలంలోని వేణునగర్ గ్రామంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులకు ఆత్రం గంగారాం–భీమక్క అనే వృద్ధ దంపతులు నివాసం ఉంటున్న ఇల్లు పైకప్పు కూలింది. ప్రమాద సమయంలో భీమక్క బయట ఉండగా.. గంగారం ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఇంటి దులాలపై పైకప్పు పడటంతో ప్రమాదం జరగలేదు. శనివారం ఘటన స్థలాన్ని తహసీల్దార్ లక్ష్మణ్ పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు పంపించనున్నట్లు పేర్కొన్నారు. తమను ప్రభుత్వం ఆదుకొని సాయం అందించాలని వృద్ధ దంపతులు కోరుతున్నారు.



ఇల్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మణ్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్‌చైన్‌గేట్: విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవన్‌లో భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా ఐదో మహాసభలు నిర్వహించారు. స్వాతంత్రం ప్రజాస్వామ్యం, సోషలిజం జెండాను ఆవిష్కరించి భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందన్నారు. విద్యాశాఖకు మాత్రం మంత్రిని సీఎం తన దగ్గరే పెట్టుకొని నిర్లక్ష్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్లను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దిగంబర్, నితిన్, శేఖర్, అరవింద్, శివ, మహేశ్, అక్షిత్ పాల్గొన్నారు.

పెట్రోకార్ విధుల్లో మహిళా కానిస్టేబుళ్లు

దస్తురాబాద్: నారీశక్తి కార్యక్రమంలో భాగంగా మండలంలోని గోడిసేర్యాల ఎక్స్‌రోడ్డు వద్ద శనివారం మహిళా కానిస్టేబుళ్లు కె.రజిత, ఎ.కల్యాణి పెట్రోకార్ విధులు నిర్వర్తించారు. వాహనాలు తనిఖీ చేసి పలువురికి జరిమానాలు విధించారు.

కుంటాల: సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని మహిళా కానిస్టేబుళ్లు సవిత, అశ్విని సూచించారు. శనివారం మండలంలోని కల్లూరు 61 జాతీయ రహదారిపై మహిళలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఏఎస్సై జీవన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారిపై మహిళా కానిస్టేబుళ్లు పెట్రోకార్, బ్లూకోర్ట్ విధులు నిర్వర్తించారు. అనంతరం వాహనాలు తనిఖీ చేశారు. కానిస్టేబుల్ శ్రీలత తదితరులు ఉన్నారు.



కల్లూరులో అవగాహన కల్పిస్తున్న కానిస్టేబుళ్లు

పాఠశాలలో విద్యార్థికి గాయం

ఖానాపూర్: పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదివే శ్రీనిత్ అనే విద్యార్థి తలకు శనివారం గాయమైంది. పాఠశాల ఆవరణలో చెట్టుపై మామిడి కాయలను విద్యార్థులు రాళ్లతో కొడుతుండగా ఉండగా.. ఓ రాయి వచ్చి శ్రీనిత్ తలకు తగిలింది. వెంటనే విద్యార్థిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. అధికారుల పర్యవేక్షణ లేకనే ఈ ఘటన చోటు చేసుకుందని విద్యార్థి తల్లిదండ్రులు వాపోయారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ సత్యంను వివరణ కోరగా.. తాను సెలవులో ఉన్నానని ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి

దస్తురాబాద్: మండలంలోని ఆకొండపేట పాతచెరువు సమీపంలో శనివారం వీధికుక్కల దాడిలో చుక్కలదుప్పి మృతి చెందింది. ఎఫ్ఎస్ఓ రవి తెలిపిన వివరాల ప్రకారం.. పాత చెరువులో నీటిని తాగేందుకు వచ్చిన చుక్కల దుప్పిని కుక్కలు తరిమి గాయపరచడంతో సమీపంలోని గడ్డిక్షేత్రంలో మృతి చెందింది. అడవిలో విధులు నిర్వహించే స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది చూసి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. పశువైద్యాధికారి సంధ్యారాణి, దేవదాస్ సంఘటనా స్థలానికి వెళ్లి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. వారి వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.